అకాల వర్షానికి చెరువును తలపిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చందుర్తి మండలం గుడిపేట కొనుగోలు కేంద్రం

భారీ వర్షం.. తడిసిన ధాన్యం

కొనుగోలు కేంద్రాల్లోకి వరద

నమస్తే నెట్‌వర్క్, మే 27: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. జనగామ జిల్లా చిల్పూరు, పల్లగుట్ట గ్రామాల్లోని కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయ్యింది. లారీలు సరిగ్గా రాక, ధాన్యం నింపడానికి బస్తాలు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని పలు కేంద్రాల్లో ధాన్యం కుప్పల చుట్టూ నీరు నిలిచింది. మల్హార్ మండలం కొయ్యూర్‌లో ధాన్యం తడిసింది. కుండపోత వర్షానికి ములుగు జిల్లా ఏటూరు నాగారంలోని కొనుగోలు కేంద్రం వద్ద లారీల్లో ధాన్యం లోడింగ్ చేస్తుండగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆదిలాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ కేంద్రాల్లో జొన్న తడవకుండా టార్పాలిన్లు కప్పారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో గొల్లపల్లి, మైలారం, చిత్తాపూర్, ఆవుడం, గంగారం గ్రామాల్లోని ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. నిర్మల్ జిల్లా కుంటాలలో వర్షానికి ధాన్యం తడిసింది. తూకం వేసిన ధాన్యాన్ని తరలించాలని రైతులు వేడుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో నువ్వుల పంటకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల చుట్టూ వరద నీరు చేరింది. వర్షానికి ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.

జూన్‌లో వానలే వానలు

దేశవ్యాప్తంగా జూన్ నెలలో వానలు దంచికొట్టనున్నాయి. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. దీర్ఘకాలిక సగటులో 108 శాతం వర్షపాతం కురవొచ్చని తెలిపింది. మొత్తంగా ఈ రుతుపవన కాలంలో దేశం దీర్ఘకాలిక సగటు వర్షపాతం 87 సెం.మీలలో 106 శాతం కురవొచ్చని వెల్లడించింది.

జనగామ జిల్లా చిల్పూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీరు

బంగాళాఖాతంలో అల్పపీడనం

- రాబోయే రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ
- తాజాగా పలు జిల్లాల్లో కురిసిన వర్షాలు

హైదరాబాద్, మే 27 (నమస్తేతెలంగాణ): నైరుతి రుతుపవనాలతో పాటు అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వానలు కురుస్తున్నాయి. మంగళవారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 29న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నట్టు పేర్కొంది. మంగళవారం ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, రాజన్న-సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, సంగారెడ్డి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినట్టు తెలిపింది.

దాదాపు అన్ని జిల్లాలకు వర్ష సూచన

రాష్ట్రంలో బుధ, గురువారాల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బుధవారం జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, సిద్దిపేట, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువొచ్చని అధికారులు తెలిపారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువొచ్చని చెప్పారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

కోస్గిలో అత్యధికంగా 6.47 సెంటీమీటర్ల వర్షపాతం

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో నారాయణపేట, వికారాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. నారాయణపేట జిల్లా కోస్గిలో అత్యధికంగా 6.47 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రాష్ట్రంలోని 10 మండలాల్లో నమోదైన అత్యధిక వర్షపాతం వివరాలు

జిల్లా	మండలం	వర్షపాతం (సెంటీమీటర్లు)
నారాయణపేట	కోస్గి	6.47
వికారాబాద్	కొడంగల్	5.45
నారాయణపేట	దామరగిద్ద	4.75
మహబూబ్‌నగర్	గాండీడ్	4.46
రంగారెడ్డి	షాబాద్	4.18
వికారాబాద్	దౌల్తాబాద్	3.36
నిర్మల్	పెంబి	2.99
మహబూబాబాద్	మహబూబాబాద్	2.98
ఆదిలాబాద్	ఉట్నూర్	2.95
నారాయణపేట	కొత్తపల్లి	2.90

నైరుతి ముందే ఎందుకొచ్చిందంటే!

వాతావరణ పరిస్థితులే వల్లేనని శాస్త్రవేత్తల వెల్లడి

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): వర్షాకాలం భారతదేశంలో షెడ్యూల్ కంటే ముందే వచ్చింది. నైరుతి రుతుపవనాల ముందస్తు రాక అరుదుగా జరుగుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. పెద్దఎత్తున సంభవించే వాతావరణ పరిస్థితులే ఇందుకు కారణమని అంటున్నారు. మే 21కి బదులుగా మే 13న దక్షిణ అండమాన్ సముద్రం, పరిసర ప్రాంతాలకు రుతుపవనాలు వచ్చాయి. నైరుతి రుతుపవనాలు శనివారం భారతదేశంలోని కేరళకు చేరాయి. జూన్ 1 కంటే ఎనిమిది రోజుల ముందుగానే ప్రవేశించాయి. ఇంతకు ముందు 2001, 2009లో రుతుపవనాలు త్వరగా వచ్చాయని నిపుణులు చెప్తున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వాటిలో ప్రధానమైనవి

1. మాడెన్-జూలియన్ ఆసిలేషన్(ఎంజేవో): ఎంజేవో.. ఇది సంక్లిష్టమైన సముద్ర వాతావరణ దృగ్విషయం. ఇది భారత రుతుపవనాలకు ప్రధానంగా దోహదపడుతుంది. మేఘాలు, గాలి, పీడనం సెకనుకు 4-8 మీటర్ల వేగంతో తూర్పు వైపునకు కదులుతున్నప్పుడు ఎంజేవో విండ్ బ్యాండ్లు ఏర్పడుతాయి. 30-60 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తాయి. ఈ చర్య భారత్ అంతటా జరిగితే, ఇది రుతుపవనాల సమయంలో వర్షపాతాన్ని ఉత్ప్రేరకపరుస్తుంది.
2. మస్కరీనా హై: దక్షిణ హిందూ మహాసముద్రంలోని మస్కరీన్ దీవులకు సమీపంలో ఉన్న అధిక పీడన ప్రాంతం. భారతదేశ రుతుపవన వర్షపాతంలో గణనీయమైన పాత్ర పోషిస్తుందని ఐఎండీ వివరిస్తుంది. ఈ పీడనం తీవ్రతలో మార్పులు దేశ పశ్చిమ తీరం వెంబడి వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి.
3. వేడి, తేమ, సోమాలిజెట్ నిలువు రవాణా: వేడి, తేమ నిలువుగా ప్రయాణించినప్పుడు, ఈ చర్యను ఉష్ణప్రసరణ అంటారు. ఉష్ణప్రసరణ చర్యలో పెరుగుదల దేశంలో వర్షపాతానికి దోహదం చేస్తుంది. మారిషస్, ఉత్తర మడగాస్కర్ సమీపంలో ఉద్భవించిన తక్కువ స్థాయి, అంతర్ అర్ధగోళ క్రాస్ ఈక్వటోరియల్ విండ్ బ్యాండ్‌ను సోమాలిజెట్ అంటారు. ఇది మేలో ఆఫ్రికన్ తీరాన్ని దాటిన తర్వాత అరేబియా సముద్రం, భారత పశ్చిమ తీరానికి చేరుకుంటుంది. సోమాలిజెట్ ఎంత బలంగా ఉంటే, భారతదేశంలో రుతుపవన గాలులు అంతబలంగా ఉంటాయి.
4. సూర్యుడు ఉత్తరార్ధాగోళం వైపు కదిలిన తర్వాత అరేబియా సముద్రంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడుతుంది. పాకిస్థాన్, సమీప ప్రాంతాలపై ఉన్న అల్పపీడన మండలం ఉత్ప్రేరకంగా పనిచేసి, రుతుపవన ద్రోణి వెంబడి తేమతో కూడిన గాలిని ఆకర్షించి, వర్షపాతాన్ని పెంచుతుంది.
5. రుతుపవన ద్రోణి అనేది అతిశీతల స్థాయి నుంచి ఉత్తర బంగాళాఖాతం వరకు విస్తరించి ఉన్న పొడవైన అల్పపీడన ప్రాంతం. ఈ ద్రోణి ఉత్తరం నుంచి దక్షిణం వైపునకు మారినప్పుడు, జూన్-సెప్టెంబర్ కాలంలో కోర్ రుతుపవన మండలంలో వర్షపాతం ఏర్పడుతుంది.

- తడిసిన ధాన్యం కొనాలని రోడ్డెక్కిన రైతులు

తడిసిన ధాన్యాన్ని తరుగు తీయకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం ధని గ్రామం వద్ద స్వర్ణ-నిర్మల్ రహదారిపై గంటపాటు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాహకులు త్వరితగతిన కొనుగోలు చేయకపోవడంతో పంట నీటిపాలవుతుందని వాపోయారు. లారీల కొరతతో ఇబ్బందులు తలెత్తున్నాయని మండిపడ్డారు. ఎస్సై శ్రీకాంత్ హామీతో రైతులు ఆందోళన విరమించారు. - సారంగాపూర్

90% ధాన్యం కొనుగోలు చేశాం: రేవంత్

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని, రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోలును విజయవంతం చేశారంటూ అధికారులు, కలెక్టర్లను అభినందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు, పంటల సాగు, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి తదితర అంశాలపై చర్చించారు. సీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు 64.5 లక్షల టన్నుల ధాన్యం సేకరించామని, రైతులకు రూ.12,184 కోట్లు చెల్లించామని చెప్పారు.

- ధాన్యం దిగుమతి చేసుకోవాలని రాస్తారోకో

కాంటాలైన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వరంగల్ జిల్లా ఖానాపురం శివారు శ్రీనివాస రైస్ మిల్లు ఎదుట రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. వర్షాలతో కల్లాల్లో ధాన్యం ఆరబోసుకున్న రైతులు ఆగమవుతున్నారని తెలిపారు. తేమశాతం రాకపోవడంతో రోజుల తరబడి ధాన్యాన్ని ఆరబెట్టాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు రోజుల తరబడి పడిగాపులు కాసున్నారని పేర్కొన్నారు. కాంటాలైన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే మిల్లర్లు రకరకాల కారణాలు చూపుతూ ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని మండిపడ్డారు. -ఖానాపురం

- వరి విత్తనాల కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

వ్యవసాయ యూనివర్సిటీ (హైదరాబాద్) మే 27: హైదరాబాద్ రాజేంద్రనగర్ భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) వద్ద వరి విత్తనాల కోసం రైతులు ధర్నాకు దిగారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన రైతులు వరి విత్తనాలు ఇవ్వాల్సిందేనని భీష్మించుకొని కూర్చున్నారు. కంటితుడుపు చర్యగా తొలుత వచ్చిన సుమారు 80 మంది రైతులకు రెండు కిలోల సంచులను అందజేసిన సిబ్బంది ఆ తర్వాత నోస్టాక్ బోర్డులు పెట్టారు. వాస్తవంగా మంగళవారం విత్తనమేళా ఉంటుందని ఐసీఏఆర్ ప్రకటించింది. రెండు రోజుల క్రితమే రద్దు చేయగా, ఆ విషయం రైతులందరికీ తెలియకపోవడంతో పెద్ద ఎత్తున తరలివచ్చారు.

- జోరువానలో జొన్నలోడ్ వాహనాల బారులు

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి మార్కెట్‌లో ఆరబోసిన జొన్న పంట తడిసి ముద్దయింది. పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడ్డారు. వివిధ గ్రామాల నుంచి జొన్నల లోడ్‌తో వచ్చిన వాహనాలు వర్షం కారణంగా మార్కెట్ యార్డు ఎదుటే బారులుదీరాయి. - జైనథ్

దంచికొట్టిన వాన

- వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో భారీ వర్షాలు
- పొంగిన వాగులు.. విద్యుత్తు సరఫరాకు అంతరాయం
- ఇల్లంతకుంటలో పిడుగుపాటుకు ఒకరు మృతి

నమస్తే నెట్‌వర్క్, మే 27: నైరుతి రుతుపవనాల ఆగమనం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. పలుచోట్ల వాగులు పొంగి పొర్లగా, మరికొన్ని చోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదిలాబాద్ జిల్లాలోని బోరిగామ వాగు పొర్లింది. ఆర్‌అండ్‌బీ రహదారులు బురదమయంగా మారాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇంద్రవెల్లి మండలం పోల్లుగూడలో జుగ్నాక్ వంశీయుల కులదేవత పెర్సపేన్ (పెద్దదేవుడు) ఆలయంపై పిడుగు పడటంతో ఆలయ గోపురం పగిలిపోయి, కలశం ఊడిపోయింది. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో లంబాడితండా ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో ఎర్రవాగు వంతెన వద్ద నిర్మించిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కుండపోత పోసింది. సాయంత్రం మూడు గంటల సమయంలో ప్రారంభమైన వర్షం సుమారు రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా భారీగా ఉరుములు, మెరుపులతో కురిసింది. ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామంలో పిడుగు పడి దాసరి లక్ష్మణ్ (26) అనే గొర్రెల కాపరి మృతి చెందాడు. కుండపోతగా వర్షం పడటంతో వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి, రాజన్న ఆలయ పరిసర రహదారులు, జాతర గ్రౌండ్ రహదారులపై వరద నీరు పొంగి ప్రవహించింది. చందుర్తి మండలంలోని గుడిపేట లోనూ వర్షం కురిసింది. వీర్నపల్లి పెద్దవాగు, గర్జనపల్లి మూలవాగులో ప్రవాహం పెరిగింది. వట్టివాగు ఉధృతికి గర్జనపల్లి, వన్‌పల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పలువార్డులు వర్షపు నీటితో జలమయమయ్యాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో వర్షం దంచికొట్టింది. మండలంలోని సూరంపేట నుంచి గంగారాంతాండ వెళ్లేరోడ్డులో వాగు ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దపల్లి జిల్లా మంథనిలో గంటన్నరకు పైగా భారీ వర్షం పడటంతో పట్టణంలోని పలు వార్డులు, లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహించింది.

మంగళవారం రాత్రి ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం

ఉమ్మడి వరంగల్‌లో భారీ వర్షం

ఉమ్మడి వరంగల్‌లో మంగళవారం భారీ వర్షం కురిసింది. వరంగల్ నగరంలో రాత్రి వరకు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి వాననీరు చేరింది. వరంగల్, హనుమకొండలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. హెడ్‌పోస్టాఫీస్ సెంటర్ జలమయం కావడంతో పక్కనే ఉన్న సీకేఎం దవాఖానకు చికిత్స కోసం వచ్చిన గర్భిణులు మోకాల్లోతూ నీటిలో నడుచుకుంటూ తమ స్వస్థలాలకు వెళ్లారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలాల్లో వర్షం దంచికొట్టింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలు గ్రామాల్లో వరద నీరు చేరింది. మహబూబాబాద్ జిల్లాలోని దంతాలపల్లి, నర్సింహులపేట, కేసముద్రం, గూడూరు, బయ్యారంలో వర్షంకురిసింది. ఖమ్మం జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలుపడ్డారు.